క్లుప్తంగా

నర్సింగ్ విద్యార్థినులకు సీపీఆర్‌పై శిక్షణ



సీపీఆర్‌పై శిక్షణ ఇస్తున్న వైద్య బృందం

మంచిర్యాలటౌన్: మంచిర్యాల ప్రభుత్వ నర్సింగ్ కాలేజీ విద్యార్థినులకు గురువారం కళాశాలలో సీపీఆర్‌పై శిక్షణ ఇచ్చారు. కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి వైద్యుడు సామిత్, నర్సింగ్ సూపరింటెండెంట్ లావణ్య విద్యార్థినులకు సీపీఆర్ చేసే విధానాన్ని వివరించారు. అత్యవసర పరిస్థితుల్లో హార్ట్ ఎటాక్‌కు గురైతే, వారి ప్రాణాలను ఎలా కాపాడాలనే దానిపై సీపీఆర్ చేసి చూపిస్తూ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నర్సింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ సుజాత, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

చట్ట వ్యతిరేక పనులు చేస్తే చర్యలు



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న సీఐ వేణుచందర్

శ్రీరాంపూర్: చట్టవ్యతిరేక పనులు చేస్తే కఠిన చర్యలు ఉంటాయని శ్రీరాంపూర్ సీఐ వేణుచందర్ తెలిపారు. పాత నేరస్తులను, మైనర్లు, పోకిరీలను, వారి తల్లిదండ్రులను పిలిచి పోలీస్‌స్టేషన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. రోడ్లపై తిరుగుతూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తే సహించమన్నారు. పాత నేరస్తులు తిరిగి ఎలాంటి గొడవలకు, నేరాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదన్నారు. సత్ప్రవర్తన కలిగి ఉండాలని, మారకుంటే పీడీయాక్టులు పెడుతామన్నారు. మైనర్లు తప్పు చేస్తే వారి తల్లిదండ్రులపై కూడా చర్యలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఎస్సై సంతోశ్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మంటలార్పే విధానంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

జన్నారం: ఇంట్లో గ్యాస్ లీకై బుడ్డి వద్ద మంటలు వచ్చినప్పుడు గాబరా పడకుండా, సమయస్ఫూర్తితో వ్యవహరిస్తే ప్రమాదం నుంచి బయట పడొచ్చని ఫైర్ అధికారి శ్రీనివాస్ పేర్కొన్నారు. మండలంలోని పొనకల్ సుందరయ్య నగర్‌లో గురువారం అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు గ్యాస్, ఎలక్ట్రీసిటీ ద్వారా జరిగే అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఏదైనా ప్రమాదం జరిగితే ఫైర్ సిబ్బందికి సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది, కాలనీవాసులు పాల్గొన్నారు.

మున్సిపల్ కాంట్రాక్టు కార్మికుల సమస్యలు తీర్చాలి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

బెల్లంపల్లి: మున్సిపాలిటీలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎమ్మార్పీఎస్ బెల్లంపల్లి పట్టణ అధ్యక్షుడు రామగిరి మహేశ్ అన్నారు. మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావుకు గురువారం శాలువా కప్పి సన్మానం చేసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మున్సిపల్ అధ్యక్షుడు రాసకొండ శ్రీనివాస్, నాయకుడు మచ్చరాజేష్, మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులు పాల్గొన్నారు.

దీక్షకు మద్దతు



సంఘీభావం ప్రకటిస్తున్న బీసీ ఐక్యవేదిక నాయకులు

పాతమంచిర్యాల: బీసీల న్యా యమైన డిమాండ్ల సాధన, తెలంగాణ బీసీ రిజర్వేషన్ బిల్లును రా జ్యాంగంలోని 9వ షె డ్యూల్డ్‌లో చేర్చాలనే డి మాండ్‌తో గత 17రోజులుగా ఢిల్లీలో ఆమరణ నిరాహార దీక్ష చేపట్టిన హిందూ బీసీ మహాసభ అధ్యక్షుడు బత్తుల సిద్ధేశ్వర్‌కు జిల్లాలోని బీసీ ఐక్యవేదిక నాయకులు మద్దతు ప్రకటించి సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో బీసీ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు మల్లయ్య, సామాజిక న్యాయవేదిక జిల్లా కన్వీనర్ రంగు రాజేశం, బీసీ రాజ్యాధికార సమితి జిల్లా కో ఆర్డినేటర్ సీహెచ్ అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

గురువుల శ్రద్ధ.. గురుకులానికి తోవ

- గురుకుల ప్రవేశ పరీక్షపై ఉపాధ్యాయుల దృష్టి
- ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ బోధన
- సీట్లు సాధించిన పలువురు విద్యార్థులు



దండేపల్లి: విద్యార్థులు, సిబ్బందిని అభినందిస్తున్న కాంప్లెక్స్ హెచ్‌ఎం

జన్నారం/దండేపల్లి: ఉత్తమ బోధన, ప్రత్యేక శిక్షణతో గురుకుల ప్రవేశ పరీక్షల్లో దండేపల్లి మండలం పెద్దపేట ప్రాథమిక పాఠశాల విద్యార్థులు, జన్నారం మండలంలోని అక్కపెల్లి గూడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటుతున్నారు. మంచి మార్కులు సాధిస్తూ, ఏటా మెరుగైన రీతిలో సీట్లు సాధిస్తున్నారు.

☞ దండేపల్లిలో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా గుర్తింపు పొందిన శ్రీలత 2018లో పాఠశాలకు బదిలీపై వచ్చారు. ఆమె పాఠశాలకు బదిలీపై వచ్చిన సమయంలో విద్యార్థుల సంఖ్య 18మంది మాత్రమే, ప్రస్తుతం 70కి చేరింది. ఇంటింటా తిరిగి తల్లిదండ్రులతో మాట్లాడి, పిల్లలను బడికి పంపాలని కోరింది. సొంత డబ్బులతో ఆటోను ఏర్పాటు చేసి పిల్లలు బడికి వచ్చేలా చూసింది. మెరుగైన బోధనతో గత మూడేళ్లుగా ఫలితాల సాధనలో 2022–23లో ఆరుగురు పరీక్ష రాయగా ఆరుగురు గురుకులాలకు ఎంపికయ్యారు. 2023–24లో 5 మందికి నలుగురు ఎంపికయ్యారు. 2024–2025లో 11మంది విద్యార్థులు రాయగా 11మంది ప్రతిభ కనబరిచి గురుకులాల్లో సీట్లు సాధించారు.

☞ జన్నారం మండలంలోని అక్కపెల్లి గూడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 221మంది విద్యార్థులుండగా నాలుగో తరగతిలో 35 మంది విద్యార్థులున్నారు. గురుకుల ఎంపిక కోసం ప్రధానోపాధ్యాయుడు జాజల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణ ఇవ్వగా ఈ విద్యాసంవత్సరం 23మంది గురుకుల పాఠశాలలో చేరేందుకు దరఖాస్తు చేసుకున్నారు. వారికి ప్రతీరోజు ఉదయం 8నుంచి 9గంటల వరకు సాయంత్రం 4నుంచి 5గంటల వరకు రోజువారీగా రెండు గంటల పాటుగా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ బోధన చేశారు. 23మంది విద్యార్థులు పరీక్షలు రాయగా మొదటి లిస్టులో 15మంది ఎంపికైనట్లు హెచ్‌ఎం శ్రీనివాస్ తెలిపారు. రెండో, మూడో లిస్టులలో మరో ఐదుగురు ఎంపికయ్యే ఆవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా విద్యాధికారి యాదయ్య, మండల విద్యాధికారి విజయ్‌కుమార్ పాఠశాల హెచ్‌ఎంతో పాటుగా, ఉపాధ్యాయ సిబ్బందిని అభినందించారు.

ప్రతీరోజు టెస్టులు



మా పాఠశాలలో ఉదయం, సాయంత్రం మాకు ప్రత్యేక తరగతులు నిర్వహించేవారు. కొన్ని రోజులు పాఠాలు చెప్పిన తర్వాత మా ఉపాధ్యాయులు రోజువారీగా స్లిప్ టెస్టులు పెట్టేవారు. వీటితో పాటుగా సెలవుల్లో జూమ్ తరగతులు నిర్వహించారు. ఏ విషయంలో వెనుకబడిన వారికి ఆ సబ్జెక్టు టీచర్ స్పెషల్ క్లాసులు తీసుకున్నారు. రోజువారీగా టెస్టులు, క్లాసులతో సీటు సాధించాను.

– ఉలవకని అనుస్మిత, విద్యార్థిని

టీంవర్క్‌తోనే ఉత్తమఫలితాలు



మా పాఠశాలలో నాతో పాటుగా పనిచేస్తున్న ఉపాధ్యాయుల టీంవర్క్‌తో గురుకుల ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు వచ్చాయి. సబ్జెక్టుల వారీగా విభజించి, అందరం శ్రద్ధతో బోధించాం. తల్లిదండ్రులకు అవగాహన కల్పించి, విద్యార్థులు ఇంటివద్ద చదివేలా చూశాం. అందరి సహకారంతో ఉత్తమ ఫలితాలు సాధించాం.

– జాజల శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయుడు

ప్రత్యేక తరగతులు నిర్వహించాం..



గురుకుల ప్రవేశ పరీక్ష రాయించే విద్యార్థులకు ప్రతీరోజు నేను, మా ఉపాధ్యాయులందరం కలిసి ప్రత్యేక తరగతులు నిర్వహించాం. పాఠశాల సమయం ముగిసిన తర్వాత కూడా వారికోసం ప్రత్యేక తగతులు నిర్వహించి, పరీక్షకు సంసిద్ధులను చేశాం. పరీక్షలో విద్యార్థులు ప్రతిభ కనబరిచి, గురుకులాలకు ఎంపిక కావడం చాలా సంతోషంగా ఉంది.

– శ్రీలత, హెచ్‌ఎం, పెద్దపేట

పారిశుద్ధ్య పనులపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

- డీపీవో వెంకటేశ్వర్‌రావు



మురుగుకాలువను పరిశీలిస్తున్న డీపీవో

భీమారం: పల్లెల్లో పారిశుద్ధ్య పనులపై నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు హెచ్చరించారు. జైపూర్ మండలం ముదిగుంట, మిట్టపల్లి, గంగిపల్లి, శెట్‌పల్లి గ్రామపంచాయతీల్లో గురువారం ఆయన ఆకస్మికంగా పర్యటించారు. పారిశుద్ధ్య అస్తవ్యస్తంగా ఉండడం, మురుగు కాలువల్లో వ్యర్థాలు వేయంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిసరాల పరిశుభ్రత పాటించాలని, మురుగు కాలువలు శుభ్రంగా ఉంచాలని సూచించారు. గ్రామపంచాయతీల్లో రికార్డులు పరిశీలించారు. ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. నర్సరీల్లో మొక్కలకు రోజుకి రెండుసార్లు నీటిని అందించాలన్నారు. తాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట ఎంపీవో బాపురావు, కార్యదర్శులు ఉన్నారు.

తాత్కాలిక షెడ్లు నిర్మించాలి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

రామకృష్ణాపూర్: పట్టణంలోని బీజోన్ రాజీవ్‌చౌక్‌లో గల కూరగాయల వ్యాపారస్తుల కో సం తాత్కాలిక షెడ్లు నిర్మించాలని మాజీ జెడ్పీటీసీ యాకూబ్‌అలీ, పలువురు చిరు వ్యాపారస్తులతో కలిసి గురువారం క్యాతనపల్లి మున్సిపల్ కమిషనర్ రాజుకు వినతిపత్రం అందించారు. షెడ్లతో పాటు లైటింగ్ కూడా ఏర్పాటు చేయాలని కోరారు. గతంలో ఇందుకోసం నిధులు మంజూరు చేసినప్పటికీ, అవి ఖర్చు చేయలేదని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలి

భీమారం: రోడ్డు ప్రమాదాల నివారణకు డ్రైవర్లు పాటు పడాలని ఎస్సై శ్వేత కోరారు. మండల కేంద్రంలో గురువారం పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో రోడ్డు ప్రమాదాలు–నివారణ అనే అంశంపై ఆటోడ్రైవర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. డ్రైవర్ల అజాగ్రత్త కారణంగానే అధికశాతం ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. మద్యంతాగి వాహనాలు నడపొద్దని సూచించారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దని పేర్కొన్నారు.

బీఆర్‌ఎస్ రజతోత్సవ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే చిన్నయ్య, గులాబీ శ్రేణులు

బెల్లంపల్లి: వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో ఈ నెల 27న నిర్వహించే బీఆర్‌ఎస్ పార్టీ రజతోత్సవ వేడుకల పోస్టర్లను గురువారం బెల్లంపల్లి బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో గులాబీ శ్రేణులతో కలిసి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ఆవిష్కరించారు. బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి కార్యకర్తలు, ప్రజలు, అభిమానులు పెద్ద ఎత్తున వేడుకలకు తరలివెళ్లాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్, పట్టణ బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎన్.సత్యనారాయణ, టౌన్ యూత్ ప్రెసిడెంట్ ఎస్.అరుణ్, బీఆర్‌ఎస్ శ్రేణులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నాయకుల ఇంటింటా ప్రచారం

మందమర్రిరూరల్: వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో ఈ నెల 27న నిర్వహించే బీఆర్‌ఎస్ రజతోత్సవ మహాసభకు అధిక సంఖ్యలో తరలిరావాలని 4వ వార్డు ప్రాణహిత కాలనీ బీఆర్‌ఎస్ కార్యక్రమ ఇన్‌చార్జి తోట సురేందర్ పిలుపునిచ్చారు. గురువారం కాలనీలోని ఇంటింటికీ తిరుగుతూ ఒకొక్కరికి బొట్టుపెట్టి మహాసభకు రావాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్, అనుబంధ సంఘాల నాయకులు మేడిపల్లి సంపత్, రాజశేఖర్, సూరిబాబు, రాజ్‌కుమార్, మద్ది శంకర్, ఈశ్వర్, తోట రాజిరెడ్డి, సమ్మిరెడ్డి తదితరులు ఉన్నారు.

కూలీలకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందజేత

జన్నారం: ఎండల తీవ్రత పెరుగుతున్నందునా వడదెబ్బ తగలకుండా ఉపాధిహామీ కూలీలు జాగ్రత్తలు తీసుకోవాలని కార్యదర్శి శ్రీపాల్, ఆరోగ్య కార్యకర్త సుభక్త పేర్కొన్నారు. మండలంలోని జన్నారం గ్రామ పంచాయతీ పరిధిలో పనిచేస్తున్న ఉపాధిహామీ సిబ్బందికి గురువారం ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు.

ప్యాడీ క్లీనర్స్ పంపిణీ

లక్సెట్టిపేట: మండలంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో లక్సెట్టిపేట, దండేపల్లి మండలాల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ఆటోమెటిక్ ప్యాడీ క్లీనర్స్‌ను పంపిణీ చేశారు. రెండు మండలాలకు 26మిషన్లు పంపిణీ చేసినట్లు మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రేమ్‌చంద్ తెలిపారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ ఎండీ ఆరిఫ్, డీఆర్‌డీవో కృష్ణ, డీపీఎం రమేష్, కార్యదర్శి రాజేశ్వర్ పాల్గొన్నారు.

అధికారులు అందుబాటులో ఉండాలి

మందమర్రిరూరల్: ప్రజలకు అధికారులు అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరించాలని ఎంపీడీవో రాజేశ్వర్ సూచించారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలని, వైద్య సిబ్బంది మందులు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా నిర్వహించాలన్నారు. మండల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

బాధితుడికి పరిహారం అందజేత

మంచిర్యాలరూరల్(హాజీపూర్): లక్సెట్టిపేట రేంజ్ పరిధిలోని పాతమంచిర్యాల అటవీ బీట్‌లో గతేడాది జూలైలో అడవి పంది దాడిలో హాజీపూర్ మండలం రాపల్లి గ్రామానికి చెందిన సింగం శంకర్‌గౌడ్ తీవ్రంగా గాయపడ్డాడు. ఆస్పత్రిలో చికిత్స పొంది కోలుకున్నాడు. బాధితుడు శంకర్‌గౌడ్ అడవిపంది దాడికి గురికాగా ఆర్థిక చేయూత కింద అటవీశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పరిహారం కోసం నివేదించగా ఇటీవల విడుదలైన రూ.23వేల చెక్కును లక్సెట్టిపేట రేంజ్ అధికారి సుభాశ్ ఆధ్వర్యంలో గురువారం అటవీ అధికారులు ఎఫ్ఎస్ఓ అతావుల్లా, ఎఫ్‌బీఓలు రాజేందర్, సంతోశ్ చేతుల మీదుగా అందజేశారు.

సమీక్షా సమావేశం

వేమనపల్లి: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మండల ప్రత్యేక అధికారి శ్రీనివాస్ అధ్యక్షతన అన్ని శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. రాజీవ్ యువవికాసం దరఖాస్తులకు ఈ నెల 30 వరకు పరిశీలించాలన్నారు. ప్రభుత్వ పథకాల అమలుపై చర్చించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కుమారస్వామి, తహసీల్దార్ రమేశ్, ఎంఈవో శ్రీధర్‌రెడ్డి, పశువైద్యాధికారిణి సుప్రియ, చందన్‌కుమార్, ఈజీఎస్ ఏపీవో సత్యప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అబాకస్ పోటీల్లో ప్రతిభ

జన్నారం: జగిత్యాల జిల్లా కేంద్రంలో గురువారం నిర్వహించిన అబాకస్ పోటీల్లో జన్నారం మండలం జయరాణి ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు హెచ్‌ఎం మధుసూదన్ తెలిపారు. పాఠశాలకు చెందిన గౌతంకుమార్ మొదటి స్థానం, సైఫొద్దీన్ రెండో స్థానం సాధించినట్లు ఆయన పేర్కొన్నారు. విద్యార్థులను పాఠశాల యాజమాన్యం అభినందించారు.

మతిస్థిమితం లేని అనాథ వృద్ధురాలికి ఆశ్రయం

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని జాఫర్‌నగర్ సాయిబాబా గుడి వద్ద కొంతకాలంగా ఉంటున్న మతిస్థిమితం లేని అనాథ వృద్ధురాలికి పోలీసులు ఆశ్రయం కల్పించారు. రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న సంధ్య గురువారం సాయిబాబ టెంపుల్‌కు వెళ్లగా వృద్ధురాలిని చూసి చలించిపోయారు. వెంటనే స్థానిక సీఐ ప్రమోద్‌రావుకు సమాచారం అందించి, వృద్ధురాలిని స్థానిక కల్వరి యువశక్తి అనాథ ఆశ్రయంలో చేర్పించేలా చర్యలు తీసుకున్నారు.

సదస్సును జయప్రదం చేయండి

పాతమంచిర్యాల: ఆదివాసులపై జరుగుతున్న అణచివేతను వ్యతిరేకిస్తూ ఏప్రిల్ 20న జిల్లాలో నిర్వహించే సదస్సును జయప్రదం చేయాలని ఏఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంజయ్య ఒక ప్రకటనలో తెలిపారు. అటవీ సంరక్షణ చట్టాలను తిరిగి అమలు చేయాలని డిమాండ్ చేశారు.

‘భూభారతి’పై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్‌దీపక్

లక్సెట్టిపేట: ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూభారతి పథకంపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ కుమార్‌దీపక్ అన్నారు. మండల కేంద్రంలోని రైతువేదిక భవనంలో గురువారం ఏర్పాటు చేసిన భూభారతి చట్టం అవగాహన సమావేశంలో మాట్లాడారు. రైతులకు ఇబ్బందులు లేకుండా సమస్యల పరిష్కారానికి భూభారతి పథకం ఉపయోగపడుతుందన్నారు. భూభారతి చట్టంపై అనుమానాలను తీర్చేందుకు సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రిజిస్ట్రేషన్‌లు, మ్యూటేషన్‌లు, భూమి సర్వే మ్యాప్ లాంటి అన్ని సౌకర్యాలను త్వరగా ఏర్పాటు చేసేందుకు ఉపయోగపడుతుందని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ మోతీలాల్, ఆర్డీవో శ్రీనివాస్, తహసీల్దార్ దిలీప్‌కుమార్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎండీ ఆరీఫ్, నాయకులు అంకతి శ్రీనివాస్, నాగభూషణం, చింత అశోక్, తోట రవి, పింగిళి రమేశ్ పాల్గొన్నారు.

పనులు వేగవంతం చేయాలి

లక్సెట్టిపేట: జూనియర్ కళాశాల భవన నిర్మాణ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న జూనియర్ కళాశాల భవన నిర్మాణ పనులను గురువారం పరిశీలించారు. వచ్చే సంవత్సరం కళాశాల అడ్మిషన్లు ప్రారంభం అయ్యేలోపు, భవన నిర్మాణ పనులను పూర్తి చేసి అప్పజెప్పాలన్నారు. పనులను నాణ్యతగా, వేగవంతంగా నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో సరోజ, అధికారులు పాల్గొన్నారు.

రైతులు సద్వినియోగం చేసుకోవాలి

- డీఆర్‌డీవో కిషన్



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కిషన్

దండేపల్లి: ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌డీవో కిషన్ అన్నారు. మండలంలోని వెల్గనూర్, గూడెం, నంబాల, కాసిపేట, కొండాపూర్, రెబ్బనపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం ప్రారంభించారు. రైతులు పండించిన ధాన్యాన్ని దళారులకు విక్రయించకుండా, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలన్నారు. కార్యక్రమాల్లో మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రేంచంద్, డీపీఎం రమేశ్, ఏపీఎం బ్రహ్మయ్య, సీసీలు, వీవో లీడర్లు, రైతులు పాల్గొన్నారు. మండలంలోని నంబాల కొనుగోలు కేంద్రాన్ని డీసీఎస్‌వో బ్రహ్మారావు, డీఎం శ్రీకళ, సందర్శించారు. కొనుగోలు కేంద్రంలో ఆరబోసిన వరి ధాన్యంలో తేమశాతాన్ని పరిశీలించారు. రైతులకు సూచనలు చేశారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

భీమారం: జైపూర్ మండలం శివ్వారం, పొనూర్, వేలాల, కుందారం, నర్సింగాపూర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం ప్రారంభించారు. కార్యక్రమాల్లో కాంగ్రెస్ నాయకులు చల్ల సత్యనారాయణరెడ్డి, గుండు తిరుపతి, మంతెన లక్ష్మణ్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి



టీకా వేస్తున్న జిల్లా పశువైద్యాధికారి శంకర్

భీమారం: పశువులకు వ్యాధులు ప్రబలకుండా రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని పశుసంవర్ధకశాఖ జిల్లా అధికారి శంకర్ కోరారు. మండల కేంద్రంలో గురువారం పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రభుత్వం పశువుల ఆరోగ్య సంరక్షణ కోసం మందులు ఉచితంగా అందజేస్తున్నట్లు తెలిపారు. మండల పశువైద్యాధికారి రాకేశ్‌శర్మ పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు టీకాలు

కాసిపేట: మండలంలోని కోమటిచేను, దుబ్బగూడెం గ్రామాల్లో గురువారం మండల పశువైద్యాధికారి సరిత ఆధ్వర్యంలో పశువులకు ఉచిత గాలికుంటు నివారణ టీకాలు వేశారు. 298పశువులకు టీకాలు వేసినట్లు తెలిపారు. రైతులు సద్వినియోగం చేసుకొని పశువులకు టీకాలు వేయించాలన్నారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది సంతోష్, రవీందర్, శ్యాం, సందీప్ తదితరులున్నారు.

వేమనపల్లి: మండలంలో ఈ నెల 16 నుంచి వచ్చే నెల 15వ తేదీ వరకు పశువులకు ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయనున్నట్లు పశువైద్యాధికారులు సుప్రియ, పవన్‌కుమార్ తెలిపారు. నాగారంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. కార్యక్రమంలో పశువైద్యాధికారులతో పాటు సిబ్బంది అస్లాం, గోపాలమిత్ర శ్రీకాంత్ పాల్గొన్నారు.

శిశువులకు ముర్రుపాలు పట్టించాలి



గర్భిణులకు సీమంతం చేస్తున్న సీడీపీవో మనోరమ

మంచిర్యాలటౌన్/భీమారం/తాండూర్/వేమనపల్లి: పుట్టిన వెంటనే శిశువులకు తల్లులు ముర్రుపాలు తాగించాలని ఐసీడీఎస్ సీడీపీవోలు సూచించారు. శిశువుల ఆరోగ్యంపై తల్లి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, ముఖ్యంగా పరిశుభ్రమైన పాలను తాగించాలన్నారు. ముర్రుపాలు బిడ్డ ఆరోగ్యానికి ఎంతగానో దోహదం చేస్తాయన్నారు. జిల్లా కేంద్రంలోని గాంధీనగర్–2, భీమారం మండలం అంకూసాపూర్, తాండూర్ మండలం మాదారం సెక్టార్, వేమనపల్లి మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం పోషణ పక్షోత్సవాలు కొనసాగాయి. గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. అంకూసాపూర్‌లో గర్భిణులకు సామూహిక సీమంతాలు, పిల్లలకు అక్షరాభ్యాసం కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో జిల్లా కేంద్రంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్యోతి, అంగన్‌వాడీ టీచర్లు ఎస్.అరుణ, ఐ.అరుణ, ఆర్పీ విజయ, ఆయాలు సత్యలక్ష్మి, లావణ్య, అంకూసాపూర్‌లో చెన్నూర్ ఐసీడీఎస్ సీడీపీవో మనోరమ, ఎంపీడీవో మధుసూధన్, తాండూర్‌లో బెల్లంపల్లి సీడీపీవో స్వరూప, ఎంపీడీవో శ్రీనివాస్, తహసీల్దార్ ఇమ్రాన్ ఖాన్, ఎస్సై సౌజన్య, డీసీసీ ఉపాధ్యక్షుడు సూరం రవీందర్ రెడ్డి, వేమనపల్లిలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సువర్ణ, అంగన్‌వాడీ టీచర్లు, గర్భిణులు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

సమాచారం

నేడు ఆయుర్వేద వైద్య శిబిరం

శ్రీరాంపూర్: సింగరేణి ఆధ్వర్యంలో శుక్రవా రం ఆయుర్వేద వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు డీజీఎం(పర్సనల్) అరవిందరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నస్పూర్ కాలనీలోని మనోరంజన్ సముదాయంలో ఉదయం 10గంటలకు ఈ వైద్య శిబిరం ప్రారంభమవుతుందన్నారు. ప్రముఖ వైద్యులు డాక్టర్ విశ్వనాథ మహర్షి హాజరుకానున్నట్లు తెలిపా రు. బీపీ, షుగర్, కీళ్లనొప్పులు ఇతర దీర్ఘకా లిక వ్యాధులతో బాధపడే వారికి పరీక్షలు చేసి, మందులు ఇవ్వనున్నట్లు తెలిపారు.

వేలం రద్దు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలోని వేంపల్లి, పాతమంచిర్యాల మేకల మండి నిర్వహణ కోసం గురువారం వేలంను వేర్వేరుగా నిర్వహించారు. వేంపల్లి మేకల మండి కోసం నలుగురు పాల్గొనగా, ఇద్దరు నాన్ లోకల్, ఇద్దరు లోకల్‌కు చెందిన వారు పాల్గొన్నారు. నాన్‌లోకల్ వారిని వద్దని చెప్పడంతో కొంత వివాదం నెలకొంది. దీనిపై ప లువురు కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేయ డ, సాయంత్రం నిర్వహించాల్సిన వేలానికి ఒక్క రు మాత్రమే హాజరవడంతో రెండింటిని రద్దు చేశారు. కార్పొరేషన్ షాపులు, తైబజార్, స్లాట ర్ హౌజ్‌కు సంబంధించిన వేలంను నిర్వహించగా, వేలంలో పాల్గొనేందుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో, వాటిని కూడా రద్దు చేసినట్లు రెవెన్యూ ఆఫీసర్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

20న బీసీ జర్నలిస్టు ఫోరం సమావేశం

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలో లక్ష్మి టాకీస్ చౌరస్తాలో ఆదివారం బీసీ జర్నలిస్టు ఫోరం సమావేశం నిర్వహించనున్నట్లు బీసీ జేఏసీ జిల్లా అధ్యక్షుడు వడ్డేపల్లి మనోహర్ ఒక ప్రకటనలో తెలిపారు. బీసీల హక్కులు రిజర్వేషన్‌ల కోసం, రాజ్యాధికారం కోసం దేశ వ్యాప్తంగా జరుగుతున్న ఉద్యమాలకు బాసటగా నిలుస్తున్న జర్నలిస్టులు ప్రజలను చైతన్యం చేస్తున్నారని,ప్రజలను మరింత చైతన్యం చేయడానికి తీసుకోవాల్సిన ప్రణాళికలపై సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

పోలీసుల తనిఖీలు

భీమిని: కన్నెపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని వెంకటపూర్ గ్రామంలో గురువారం నకిలీ పత్తి విత్తనాలు ఉన్నాయన్న సమాచారంతో ఎస్సై గంగారాం, సిబ్బందితో కలిసి విస్తృత తనిఖీలు చేపట్టారు. అనంతరం గ్రామస్తులకు అవగాహన కల్పించారు.